బాలలకు సత్వర వైద్యం

ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో పిల్లలకు సత్వర వైద్య సేవలు అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఓపీ, తనిఖీ గది, వార్డు ఏర్పాటు చేశారు. పిల్లల్లో ఇటీవల దృష్టి సమస్యలు పెరగడంతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ దృష్టి సారించి, ఆదేశాలు జారీ చేయడంతో చిన్నారులకు నిరీక్షణ తప్పింది.


కంటి సమస్యలతో నేత్ర వైద్యశాలకు తనిఖీకి వచ్చిన పిల్లలు


బాలికకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

ఇలా చేస్తే మేలు

పిల్లల కంటిచూపును కాపాడేందుకు వైద్యనిపుణులు చేస్తున్న సూచనలు

- స్క్రీన్ టైం పరిమితం చేయాలి.
- 20–20–20 నియమాన్ని పాటించాలి. 20 నిమిషాల తర్వాత 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులను 20 సెకన్ల పాటు చూడాలి.
- స్మార్ట్‌ఫోన్‌కు అడుగు దూరం, ల్యాప్‌టాప్ డెస్క్‌టాప్‌నకు 2అడుగుల దూరంలో కూర్చోవాలి.
- ప్రతి ఆరునెలలకు ఒకసారి విటమిన్ 'ఏ' ద్రవం తాగించాలి.
- విటమిన్ 'ఏ' అధికంగా ఉండే క్యారట్, బొప్పాయి. స్వీట్ పొటాటో, ఆకుకూరలను ఆహారంలో ఉండేలా చూడాలి.
- ఆరుబయట ఆటలు ఆడేలా ప్రోత్సహించాలి.

ప్రాంతీయ నేత్రవైద్యశాలలో ప్రత్యేక ఓపీ, వార్డు ఏర్పాటు

దృష్టి సారించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

ఎలక్ట్రానిక్ స్క్రీన్ టైంతో పిల్లల్లో మందగిస్తున్న కంటి చూపు

సీతంపేట: దృష్టిలోపాల బారిన పడుతున్న పిల్లల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోంది. వారిలో కంటిచూపు మందగించేందుకు ఒకప్పుడు ప్రధాన కారణం విటమిన్ లోపాలు కాగా.. ప్రస్తుతం ఎక్కువసేపు స్క్రీన్ టైం వల్లనే అని చెప్పవచ్చు. ఎక్కువ సేపు మొబైల్‌ఫోన్స్, టీవీలు, కంప్యూటర్లు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అలవాటు పడటం వల్ల కంటిపై ఒత్తిడి పెరగడం, అలసటతో కళ్లు పొడిబారడం వంటి లక్షణాలతో దృష్టి లోపాలు సంభవిస్తున్నాయి. పాఠశాలకు వెళ్లే పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. దగ్గర వస్తువులను తప్ప, దూరంగా ఉండేవాటిని స్పష్టంగా చూడలేకపోతున్నారు. దీంతో బ్లాక్‌బోర్డుపై టీచర్ రాసేది కనిపించడం లేదని తరగతి గదిలో ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న మాట. దీనిని అధిగమించడానికి కంటి పరీక్షలు చేయించుకుని దానికి అవసరమైన కంటి అద్దాలు వాడాలి. ఏ స్కూల్‌లో చూసిన తరగతి గదిలో ముందు వరసలో కూర్చున్నవారిలో ఎక్కువ మంది కంటి చూపు సమస్యను ఎదుర్కొంటున్న వారే. వీరంతా కళ్లజోడు ధరించి పాఠశాలలకు హాజరు అవుతున్నారు.

ఓపీలో చిన్నారులే అధికం

ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రికి వస్తున్న రోగుల్లో 9 నుంచి 14 శాతం పిల్లలు ఉంటున్నారు. పిల్లల్లో దృష్టి లోపాల తీవ్రతను గుర్తించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ వారికి సత్వర వైద్య సేవలందించడంపై దృష్టి సారించారు. రామాటాకీస్ రోడ్‌లో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో పిల్లల కోసం ప్రత్యేక, వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఫలితంగా గత జనవరి నెల 22 తేదీన ఆస్పత్రిలో పిల్లల కోసం ప్రత్యేక ఓపీ, ప్రత్యేక తనిఖీ గది, 6 బెడ్స్‌తో ప్రత్యేక శస్త్రచికిత్స గది ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పిల్లలు గంటల తరబడి నిరీక్షించకుండా త్వరితగతిన వైద్యసేవలు పొందుతున్నారు. రోజూ 450నుంచి 500 వరకు ఓపీ వస్తుండగా, అందులో 25 నుంచి 40 మంది పిల్లలు ఉంటున్నారు.


ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో పిల్లల వార్డును ప్రారంభిస్తున్న గొండు సీతారామ్

18ఏళ్ల లోపు పిల్లలకు ప్రత్యేక ఓపీ



పిల్లల కోసం ఆస్పత్రిలో జనవరి 22న ప్రత్యేక ఓపీ సదుపాయం కల్పించాం. పెద్దలతో క్యూలో నిలబడకుండా పిల్లలకు వేరేగా ఓపీ స్లిప్ ఇచ్చేలా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం. ఓపీ స్లిప్ తీసుకున్నాక ప్రత్యేక తనిఖీ కేంద్రంలో కంటి పరీక్షలు చేయించుకోవచ్చు. దీని వల్ల నిరీక్షించకుండా పిల్లలు సత్వర వైద్య సేవలు పొందే సదుపాయం కల్పించాం. శస్త్ర చికిత్స అవసరమైన పిల్లల కోసం ఆరు బెడ్స్‌తో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం ఆస్పత్రి పనిదినాల్లో 18 సంవత్సరాలలోపు పిల్లలు ఎవరైనా సత్వర వైద్య సేవలు పొందవచ్చు. ఏదైనా ఇబ్బంది కలిగితే మమ్మల్ని సంప్రదించవచ్చు.

–డాక్టర్ వి.మీనాక్షి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల

ఇబ్బంది కలిగితే కమిషన్ దృష్టికి తీసుకురండి



అన్ని ఆస్పత్రుల్లో పిల్లలకు సత్వర వైద్యసేవలు అందేలా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కృషి చేస్తోంది. ప్రాంతీయ నేత్ర వైద్యశాలలోనూ అదేవిధంగా ఏర్పాటు చేశారు. పిల్లల వైద్యసేవల్లో ఎటువంటి ఇబ్బంది, జాప్యం కలిగినా కమిషన్ దృష్టికి తేవచ్చు. పిల్లల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– గొండు సీతారామ్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

త్వరగా సేవలు అందుతున్నాయి



నాకు కంటి చూపు సమస్య ఉంది. కళ్లజోడు వాడుతున్నాను. ప్రతి ఆరు నెలలకు ఒకసారి చెకప్‌కు వస్తుంటాను. గతంలో అందరితో కలిసి క్యూలో నిలబడేవాడిని. ఇప్పుడు పిల్లల కోసం సెపరేట్ ఓపీ, తనిఖీ పెట్టారు. త్వరగా వైద్య సేవలు అందుతున్నాయి.

– శరత్‌చంద్ర, విద్యార్థి, లాసన్స్‌బే కాలనీ

ప్రత్యేక వార్డులో చికిత్స

నాకు దూరంగా ఉండే వస్తువులు కనబడవు. కళ్లు ఎర్రబారడం, మంటతో ఇబ్బంది పడుతున్నాను. లేజర్ సర్జరీ చేశారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డులో చికిత్స అందించారు. నిరీక్షించకుండా పిల్లలకు వైద్యం చేస్తున్నారు.

– వి.దాస్, విద్యార్థి, చిలకపేట

క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30లకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

చలివేంద్రం ఏర్పాటు


ఆర్గానిక్ హెల్త్ డ్రింక్ అందజేస్తున్న కీర్తి పట్నాయక్

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు అల్లూరి సీతారామరాజునగర్ నూకాంబికా ఆలయం ప్రాంగణంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు పి.బుచ్చిరాజు శర్మ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లని ఆర్గానిక్ హెల్త్ డ్రింక్ పాదచారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిశోర్ శర్మ, దేవదాయ శాఖ ఉద్యోగి కృష్ణ, విజయకుమార్, బి.వెంకటేశ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బహుజన్ సమాజ్ పార్టీలోకి నందికొల్లా


అప్పారావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న అన్వేష్, కనకమహాలక్ష్మి

సీతమ్మధార: బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీమరెడ్డి విశ్వనాథం, ఉత్తరాంధ్ర జోన్–1 ఇన్‌చార్జి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ములకలపల్లి అన్వేష్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా అధ్యక్షురాలు పెద్దాడ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నందికొల్లా అప్పారావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి బలవన్మరణం

సీతమ్మధార: మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వలేదని ఒక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేట రెల్లి వీధికి చెందిన దేవులపల్లి రవి (40) భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి పూటుగా మద్యం సేవించి డబ్బులు కావాలని భార్యతో గొడవపడ్డాడు. తర్వాత గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో భార్య చుట్టు పక్కల వారి సహాయంతో కిందకు దింపించింది. అయితే అప్పటికే రవి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబం చెంతకు అభాగ్యుడు

సీతమ్మధార: ఒడిశాలోని నవరంగ్‌పూర్‌కు చెందిన సుధాకర్ (45) అవివాహితుడు. తల్లిదండ్రులు చనిపోవడంతో మానసికంగా కుంగిపోయి రోడ్ల మీద తిరిగేవాడు. ఈనెల 15వ తేదీన రైల్వే పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది రైల్వే స్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై అతన్ని గుర్తించారు. టీఎస్‌ఆర్ మెన్ షెల్టర్లో అతనికి ఆశ్రయం కల్పించారు. అతనికి పెదనాన్న కుమారుడు ఉన్నాడని తెలుసుకుని ఫోన్ చేసి రప్పించారు. సుధాకర్ మరోసారి రోడ్ల మీద తిరగకుండా చూసుకుంటామని వారు చెప్పడంతో అన్నయ్య కిరణ్‌కుమార్ సమక్షంలో సుధాకర్‌ని అప్పజెప్పినట్లు షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

రుషికొండ భవంతిని మ్యూజియంగా మార్చాలి


వివరాలు వెల్లడిస్తున్న కొత్తపల్లి వెంకటరమణ

అల్లిపురం: రుషికొండలో గల భవంతిని మ్యూజియంగా మార్చాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకట రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో మాట్లాడారు. విషయాన్ని ఇప్పటికే శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. విశాఖ జిల్లా బౌద్ధ చారిత్రక వారసత్వం కలిగిన ప్రాంతమని, జైనమతం ఆనవాళ్లు కూడా ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయన్నారు. తొట్లకొండ, బావికొండ, బొజ్జన్న కొండలతో పాటు శ్రీకాకుళం దాటి పొరుగు రాష్ట్రాల వరకు ఈ సంస్కృతి, సంప్రదాయాలు వ్యాప్తి చెంది ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి మ్యూజియం లేదన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో చారిత్రక సంపద హైదరాబాద్ మ్యూజియంలో ఉండిపోయిందన్నారు. చారిత్రక వారసత్వ సంపదను భద్రపరిచే నిలయంగా రుషికొండ ప్యాలెస్‌ను మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అల్లు అప్పారావు, జె. రాంప్రభు, జేవీ భాస్కరరావు, బోనెల అప్పారావు, ఎన్.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు పూర్తయ్యేనా?


గురుద్వారా సమీపంలోని సర్వీస్ రోడ్‌లో పూర్తికాని కల్వర్టు పనులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు స్థానిక గురుద్వారా కూడలి సమీపంలో పాత పెట్రోల్ బంకు వద్ద సర్వీస్ రోడ్‌లో డ్రెయిన్‌పై కొత్తగా కల్వర్టు నిర్మించారు. తరచు డ్రెయిన్ బ్లాక్ అవుతోందని సుమారు రూ.10 లక్షల వ్యయంతో కొత్తగా బాక్సు కల్వర్టు నిర్మించారు. దీంతో రెండునెలలుగా మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గురుద్వారా నుంచి గణేష్‌నగర్ వెళ్లడానికి చుట్టు తిరిగి వెళ్తున్నారు. కల్వర్టుకు రెండువైపులా అప్రోచ్ రోడ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేసి వాహనాల రాకపోకలకు వీలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


పదోన్నతి పొందిన ఉద్యోగికి సత్కారం


సాయిలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్) కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తూ అదే కాలేజీలో ఆఫీసు సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన కిల్లి సాయిలక్ష్మిని గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ శుక్రవారం సత్కరించి అభినందించారు. ఆమె పని చేస్తున్న కాలేజీలకే ఓఎస్‌గా పదోన్నతిపై రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయిలక్ష్మి ఆఫీసు సూపరింటెండెంటుగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ ఎస్.ప్రశాంత కుమారి, రిటైర్డ్ ఓఎస్ కె.వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్లు వై.అప్పలసూరి, పి.లిఖిత నేహ, జూనియర్ అసిస్టెంట్లు పి.పార్వతి, ఎస్.మనోహర్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- తొమ్మిది బైకులు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల వద్ద క్రైం ఏసీపీ లక్ష్మణరావు, సీఐ రాజులునాయుడు, ఎస్‌ఐ సునీల్ తదితరులు

అల్లిపురం: ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను టూటౌన్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి తొమ్మిది బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు వివరాలు వెల్లడించారు. జనవరి 22వ తేదీ రాత్రి అల్లిపురం, యాతపేట, మసీదు సమీపంలో షేక్ రంజాన్ తన ఇంటి ముందు బండిని పార్కు చేశారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి అతని బైక్ కనిపించకుండా పోయింది. దీంతో అతను టూటౌన్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు క్రైం డీసీపీ కె. లతామాధురి పర్యవేక్షణలో క్రైం ఏడీసీపీ ఎం.మోహనరావు, ఏసీపీ డి.లక్ష్మణరావు, క్రైం సీఐ సీహెచ్ రాజులనాయుడు పర్యవేక్షణలో ఎస్‌ఐ ఎస్.సునీల్ తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టాడు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులు అంతర్రాష్ట్ర దొంగలుగా గుర్తించారు. ఒడిషా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన కార్తీక్ కిల్లో, బాబుల సుపియాలను అదుపులోకి తీసుకుని నగర పరిధిలో దొంగిలించిన మూడు రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌లు, యమహా ఆర్ 15 బైక్‌లు నాలుగు, కేటీఎం ఆర్‌సీ 200, యమహా ఎఫ్‌జెడ్ వంటి రూ.10 లక్షలు విలువ గల తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ హఫీజ్, కానిస్టేబుళ్లు గోవిందరావు, గణేష్, బాలాజీ, అజీజుద్దీన్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని శుక్రవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ కె. శాంతారాం, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఓ మిస్త్రీ శుక్రవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన అజిత్ బురిడి విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా విజయవాడకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, రూ. 35 వేలు విలువ గల 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ


మాట్లాడుతున్న ఆర్ఎఫ్‌వో నిరంజన్‌రెడ్డి

అల్లిపురం: హోటళ్లలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రీజినల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలో ఒక హోటల్లో నగర హోటళ్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు తెలియజేశారు. ప్రతి ఏడాది అగ్నిమాపక వారోత్సవాలు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోటళ్లు, పరిశ్రమల్లో సిబ్బందితో పాటు గృహస్తులు కూడా అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నగరంలో మరో నాలుగు అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసిందన్నారు. అందుకు తగిన భూమిని కలెక్టర్ కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఎఫ్‌వోలు పి.సింహాచలం, సిబ్బంది, హోటల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బుచ్చయ్య

మురళీనగర్: టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో నేటి సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు, నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య (92) కోరారు. తొమ్మిది పదుల వయసులోనూ ఆయన సామాజిక చైతన్య కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ మేరకు ఆయన స్వయంగా శుక్రవారం సైబర్ నేరాల నిరోధంపై ప్రచారం చేశారు. వాకర్స్ పార్కులోని పలువురు వాకర్లను కలిసి సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, అప్రమత్తత పట్ల వివరించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్లకు జవాబు ఇవ్వొద్దని, మొబైళ్లలో ఎటువంటి బెట్టింగు యాప్‌లు డౌన్‌లోడ్ చేయొద్దని, వాటిని సోషల్ మీడియాలో ఇతరులకు షేర్ చేయొద్దని, లాటరీలకు సంబంధించి పాస్‌వర్డులు అడిగితే అవి మోసపూరితమైనవిగా గ్రహించాలని, 'స్క్రాచ్ చేయండి– రివార్డు పొందండి'అంటూ వచ్చే సందేశాలకు జబాబు ఇవ్వరాదని, ఏపీకే పేరుమీద వచ్చే యాప్‌లను ఓపెన్ చేయొద్దని, పెట్టుబడులు పెట్టి లాభాలు పొందండంటూ వచ్చే సందేశాలకు స్పందించరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, రిటైర్డ్ ప్రొఫసర్ సబ్బినేని రామ్మోహనరావు, పాలిటెక్నిక్ కాలేజీ మైనింగ్ డిపార్టుమెంటు హెడ్ కాటమనేని వెంకటరమణ, డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు


గుడ్‌ఫ్రైడే వేడుకల్లో వాక్యసందేశం అందజేస్తున్న సిస్టర్ షైలాపాల్


శిలువ మోస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెంలో గల పోర్టు స్టేడియం, విశ్వనాథ్ కన్వెన్షన్‌లో పీజే స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ పీజే స్టీఫెన్‌పాల్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే ఆరాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సిస్టర్ షైలాపాల్ మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవాళి పాపాల నిమిత్తం తన విలువైన రక్తాన్ని కార్చి, ఆ పరిశుద్ధ రక్తం ద్వారా మానవులకు పాపక్షమాపణ కలిగించారని తెలిపారు. క్రైస్తవ్యం ఒక మతం కాదని, మార్గమని పీజే స్టీఫేన్‌పాల్ వర్చువల్‌గా సందేశమందించారు. ఈస్టర్ సందర్భంగా 20వ తేదీ ఆదివారం వేకువ జాము ఆరాధన తెల్లవారి 4 నుండి ఇదే స్థలంలో ప్రారంభం అవుతుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఇదే స్థలంలో ప్రత్యేక ఉజ్జీవ సభ ఏర్పాటు చేస్తున్నామని, ఈ సభలో పాల్గొని దైవాశీర్వాదం పొందాలని పిలుపునిచ్చారు.

మురళీనగర్ పునీత ఫ్రాన్సిస్ చర్చిలో..

మురళీనగర్: స్థానిక పునీత ఫ్రాన్సిస్ చర్చిలో ఉదయం 9 గంటలకు యేసు క్రీస్తుకు శిలువ వేసిన దృశ్యంతో శిలువ యాత్ర చేశారు. మురళీనగర్ నుంచి బ్యాంకు వీధి, వర్మ కాంప్లెక్సు మీదుగా ఈ యాత్ర సాగింది. డాక్టర్ కన్నా కిరణ్ కుమార్ శిలువను మోసుకుంటూ ఆనాటి సత్య సంధుడు క్రీస్తు దృష్టాంతాన్ని ప్రదర్శించారు. విచారణ కర్త రాజశేఖర్, ప్రసంగీకుడు శౌరి ఆయనను నడిపించారు. విచారణ పెద్దలు పి.సింహాచలం, అరసాడ ఆంథోని పాల్గొన్నారు. క్షమ, సేవ, ప్రేమలే శుభ శుక్రవారం ప్రధాన సందేశంగా వక్తలు పేర్కొన్నారు. అత్యధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

రేపు చిత్రలేఖనం పోటీలు

మద్దిపాలెం: ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముకుందరావు తెలిపారు. జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో శుక్రవారం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. 7వ తరగతి వరకు జూనియర్లుగా, ఇంటర్ వరకు విద్యార్థులను సీనియర్లుగా పరిగణిస్తామని, పోటీలో పాల్గొనే వారికి కేవలం డ్రాయింగ్ షీట్లు మాత్రమే అందజేస్తామన్నారు. ఇతర చిత్రలేఖన సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 83338 49955ను సంప్రదించవచ్చు. సమావేశంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.

24న మెగా జాబ్‌మేళా

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ప్రభుత్వ విప్ గణబాబు శుక్రవారం గోపాలపట్నం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.